డాక్టర్ ముఖం ఎర్రబడింది.

"మొన్న తీసుకొచ్చిన అమ్మాయి మీ భార్య అని ఎందుకు చెప్పారు?"

"ఆ రోజు మేమిద్దరం భార్యాభర్తలుగా వున్నాం కనుక. అదీగాక కాదంటే మీరు ఫీజు పెంచేస్తారని కూడా."

"యూ ఆర్ మాడ్" అందామె కోపంగా.

"కరెక్ట్....! ఆ కాసేపు నిజంగా పిచ్చి ఎక్కినట్లే ప్రవర్తిస్తారని ఇంకోకామె కూడా చెప్పింది."

డాక్టర్‌కి అతనితో మాట్లాడాలనిపించలేదు.

"వాటీజ్ ది ప్రాబ్లెమ్?" తులసి నడిగిందామె.

"డిలే అయ్యింది?"

"మీకు పెళ్ళయిందా"

"చాలావరకూ అయింది" సురేష్ చెప్పాడు. తులసి అతనివైపు చురచురా చూసింది.

"ఎస్! మారీడ్"

"మరెందుకు భయం?"

"అతనికి జాబ్ లేదింకా"

"అందుకే ఈ జాబ్" నవ్వుతూ అన్నాడు.

"ఎన్ని రోజులయింది?"

"ఓన్ లీ వన్ వీక్"

"ఓన్ లీ వన్ వీక్...."

"ఎస్ ఓన్‌లీ వన్ వీక్..."

"ఓ.కె! ఈ టాబ్‌లెట్స్ వాడిన తర్వాత రండి..."టాబ్‌లెట్స్ రాసిచ్చిందామె.

తులసి కాగితం తీసుకుంది.

"అయినా మీరేదైనా మెథడ్ ఉపయోగించాలిగానీ మాట్లాడితే ఇలా డాక్టర్ దగ్గరకు...."

"అఫ్‌కోర్స్....మేము సేఫ్ పిరీడ్ ఫాలో అవుతున్నాం" అన్నాడు సురేష్ .

"దటీజ్ నాట్ సో సేఫ్" చిరాకుగా అంది డాక్టర్.

"అవునవును...మిగతా పదిహేను రోజులూ డేంజరస్. అందుకే శ్రీకృష్ణుడు అంతమందిని మ్యారేజ్జేసుకున్నాడు. ఎవరికి సేఫ్ పిరీడ్ అయితే వాళ్ళ దగ్గర కంప్లీట్ సేఫ్...."

డాక్టర్ కోపంగా చూసిందతనివైపు.

"విల్ యూ కన్‌ఫైన్ టు దిస్ సబ్జెక్ట్."

"ఓ డెఫినెట్‌లీ! ప్రస్తుతం వున్న మెథడ్స్ కాకుండా కొత్తదేదైనా చెప్పగలరా?"

"సింపుల్ మెథడ్ ఒకటుంది" అందామె కసిగా.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగింది తులసి .

"రోజుకో యాపిల్ పండు తినాలి. అంతే..."

"మైగాడ్...ముందా...? తర్వాతా....?" అడిగాడు సురేష్ ఉత్సాహంగా.

"ముందూ కాదు- వెనుక కాదు. దాని బదులు..." నవ్వుతూ అందామె.

అతనికి అర్థమయింది. తనను ఎదురు దెబ్బ కొట్టేసింది.

తులసి ఫీజు కట్టేసింది.

"ఒకవేళ యాపిల్ మిస్సయితే సిజేరియన్" నవ్వుతూ అన్నాడు లేచి నిలబడి. డాక్టర్ ముఖం వాడిపోయింది.

"వాట్ సిజేరియన్?"

"టూ థవుజండ్ క్యాష్ ఆపరేషన్. సీజర్ నివాస్ బిల్డింగ్ ఫండ్...."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్?"

"నెక్ట్స్ టైమ్ చెప్తాను- ఇంకో కేస్ తెచ్చినప్పుడు. బైదిబై...మీ సిజేరియన్ ఏజెంట్‌గా నన్ను అపాయింట్ చేసుకోకూడదూ? కావల్సినన్ని కేసులు బుక్ చేసుకొస్తాను."

ఇద్దరూ బయటికొచ్చేశారు.

బస్ దిగి ఇంటి వైపు నడుస్తూంటే తులసి పిలిచిందతనిని.

"సురేష్... "

"ఎస్ డియర్?"

"ఎవరా అమ్మాయ్?"

"ఏ అమ్మాయ్?"

"అదే! నువ్ మొన్న డాక్టర్ కుమారి దగ్గరకు తీసుకెళ్ళిన కేస్?"

"ఓ నీకు తెలిసిపోయిందన్నమాట! నటాషా."

"ఎందుకు?"

"టెర్మినేషన్‌కి! ఇదిగో ముందే చెబుతున్నాను. నాకేం సంబంధం లేదు తనతో."

ఇద్దరూ ఇంట్లోకి అడుగు పెట్టారు.

"ఫాదరెవరు మరి?"

"చమన్‌లాల్, మక్కన్‌లాల్... ఎవరో నటాషాకే తెలియదు హంగోవర్ ట్రాజెడీ...."

తులసి మంచంమీద కూర్చుంది.

కొద్దిక్షణాలు నిశ్శబ్దం. హటాత్తుగా ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినాయ్. వెక్కి వెక్కి ఏడ్చేయసాగింది.

సురేష్ తుళ్ళిపడ్డాడు. చటుక్కున ఆమె పక్కన కూర్చుని దగ్గరకు లాక్కున్నాడు.

"తులసీ ఏమిటిది? ఏం జరిగింది?"

"నాకు అబద్ధం చెప్తున్నావ్ కదూ?"

"నేనా?"

"అవును! నటాషాతో నువ్వే రెస్పాన్సిబుల్ కదూ?"

"తులసీ ఐ లవ్ యువర్ బాడీ. ఐ లవ్ ఎవ్విరి పార్ట్ ఆఫ్ యూ. నాకింకో అమ్మాయి అవసరం లేదు. నీకూ తెలుసా విషయం."

"నాకేం తెలీదు"

పెదాలు కలుసుకుని పక్కకు జారిపోయినయ్. ఆమె కన్నీటిబొట్టు. నాలుకతో స్పృశించాడు.

తులసికి చక్కలిగిలి ఎక్కువయిపోతోంది. అతని తలను లాక్కుని గుండెలకు హత్తుకుంది అతని చేతులు స్టీరింగ్‌లా ఆమెను చుట్టుకున్నాయి.

"అప్పుడప్పుడూ మిగతా అందరు మొగాళ్ళలా అబద్దాలు చెప్పకూడదూ?" కళ్ళు మూసుకుంటూ అడిగింది.

"నీ దగ్గర చెప్పలేను-వీక్‌నెస్!"

"ఏం వీక్‌నెస్?"

"ఇది" ఆమెతో పాటు వెనక్కు వంగిపోయాడు. అ తరువాత చాలా రొటీన్‌గా జరిగిపోయింది. మత్తు, ఒగర్పులు అలుపు.

"సురేష్!"

"తులసీ!"

"సురేష్!"

"తులసీ!"

తలుపులు తెరచుకున్నయ్.

ఎదురుగా గంగాభవాని! సిగ్గుతో ముఖం ఎరుపెక్కిపోయి, పెద్దవిగా చక్రాల్లా సాగిన కళ్ళను కుంచించుకోలేక, వెనక్కు తిరగలేక, ముందుకు అడుగు వేయనూ లేక, మట్లాడలేక, నిశ్శబ్దంగానూ వుండలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ-

సురేష్ ముందుగా తేరుకున్నాడు.

"రండి..రండి...వెల్‌కమ్....హిప్నాటిజం కమ్ మాజిక్ షో"

తులసి వంటింట్లోకి పరుగెత్తింది.

గంగాభవాని బయటకు పరుగెత్తింది.

"గంగాభవానిగారూ! రండి! తులసి ఒన్ బై టూ 'టీ' ఇస్తుంది"

తులసి నవ్వాపుకుంటూ వచ్చింది గదిలోకి.

"నీతో ఇదే తలనొప్పి ఇరుగు పొరుగూ ఏమీ చూడవ్."

"అన్యాయం! రోజుకొకరే అని చెప్పాను కదా ముందే. ఇలాఅందరూ ఒకేసారి జొరపడితే నావల్ల కాదు. నేనూ మనిషినే."

"రేపట్నుంచీ మన సంగతి ఏమాలోచించావ్? నాకో నీకో ఎవరోకరికి ఉద్యోగం దొరక్కపోతే."

"డోంట్‌వర్రీ! అవసరమయితే ఏదోక ఉద్యోగంలో చేరిపోతాను. డాక్టర్ కుమారి దగ్గర సిజేరియన్ సెక్రటరీలాంటిది."

"నేను మహేష్‌తో మాట్లాడాను" అంది తులసి .

సురేష్ మంచం మీదనుంచి లేచి కూర్చున్నాడు. ఆమెను తన వళ్ళోకి లాక్కున్నాడు.

"నిజం చెప్పు-నీ పాపకు తండ్రెవరు?"

"అలోచించి చెప్తాను!" నవ్వాపుకుంటూ అంది.

"మహేష్ కదూ?"

"ఛీ మరీ ఇంత సిగ్గులేకుండా పోయిందేం?"

"మరి మహేష్ నువ్వూ ఎందుక్కల్సుకున్నారు?"

"జాబ్ విషయం మాట్లాడ్డానికి"

"తన జాబే తను సరిగ్గా చేయలేడు. ఇంక"

"తనకు తెలిసిన ఓ ప్రైవేట్ కంపెనీలో ఇప్పిస్తానన్నాడు. టెంపరరీగా."

"సినిమాహాల్లో రెండు గంటలు పక్కన నీలాంటి అందాలదేవతనుంచుకొని ముద్దు పెట్టుకోటానికి భయపడినవాడు నాకు ఉద్యోగం చూడటమా! నో! అంత చేతకాని స్టేజ్‌కి దిగజారలేదు నేను."

"రేపు సాయంత్రం వాళ్ళింటికి మనం డిన్నర్ కెళుతున్నాం మహేష్ ఫ్రెండ్-అదే-ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌ని కూడా ఇన్ వైట్ చేస్తున్నాడు మన కోసం. అక్కడ పరిచయం చేసి నీ ఉద్యోగం విషయం.... "

సురేష్ చేతులు ఆమెని చుట్టేసినయ్ మళ్ళీ "రేపు సంగతి ఇప్పుడెందుకు కమాన్" తులసి అతనిని వదిలించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. గంగాభవాని తలుపువరకూ వచ్చి అనుమానంగా చూసి వెనుకకు తిరిగింది.

తులసి సురేష్‌ని వదిలించుకుని పరుగెత్తింది బయటకు.

"రండి" అంది గంగాభవానితో.

గంగాభవాని డేగకళ్ళతో సురేషుని గమనిస్తూ లోపలికొచ్చింది.

"కాఫీ పొడి కావాలి కొంచెం."

“ఓస్ దానికోసమా- నేనింకా నా కోసం వచ్చారనుకున్నాను” అన్నాడతను.

తులసి లోపలికెళ్ళింది నవ్వుతూ.

“కొంచమైనా సిగ్గుండాలి” అంది గంగాభవాని అసహనంగా.

“సిగ్గు పడితే మానవజాతి ఎప్పుడో హరించిపోయేది.”

“ఇలా బరి తెగించే వాళ్ళకంటే అదే నయం.”

“మీ ఇష్టం! మీకు పిల్లలు వద్దంటే ఏదో ఒక పద్ధతి అవలంబిద్దాం.”

ఆమె అదిరిపడింది.

“ఆ మాటెవరన్నారిప్పుడు?”

“మీరేగా పాపులేషన్ పెరగకుండా చూద్దామన్నారు.”

తులసి కాఫీపొడితో తిరిగి వచ్చింది. అది అందుకుని విసవిసా వెళ్ళిపోయిందామె.

డిన్నర్ పెద్ద ఎత్తున ఏర్పాటు చేశాడు మహేష్.

అతని ఫ్రెండ్ ఆనంద్, అతని భార్య కల్పన కూడా వచ్చారు.

“ఇతనే మహేష్” అంటూ సురేష్‌కి పరిచయం చేసింది తులసి.

“హలో- హౌ డూ యు డూ!” అన్నాడు మహేష్ కరచాలనం చేస్తూ.